# యువత ఓట్లే కీలకం..

- అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించేలా యువ ఓట్లు
- భద్రాద్రి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ వీరే అధికం
- 9,45,094 ఓటర్లలో 4,75,746 మంది మధ్య వయస్కులే
- అందులోనూ కొత్తగూడెంలో అత్యధికంగా 1,17,058 మంది
- భవితకు బంగారు బాటలు వేసే వాళ్ల వైపే యువ ఓటర్ల చూపు




ఓటర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న ఓటర్లు (ఫైల్)

**నియోజకవర్గాల వారీగా యువ, మధ్య వయసు గల ఓటర్ల వివరాలు ఇలా..**

| నియోజకవర్గం | 18 - 19 ఏళ్లు | 20 - 29 ఏళ్లు | 30 - 39 ఏళ్లు | మొత్తం |
|---|---|---|---|---|
| పినపాక | 4,850 | 38,184 | 58,285 | 1,01,319 |
| ఇల్లందు | 5,007 | 41,025 | 61,744 | 1,09,776 |
| కొత్తగూడెం | 5,882 | 44,359 | 66,827 | 1,17,058 |
| అశ్వారావుపేట | 4,117 | 29,399 | 44,814 | 78,330 |
| భద్రాచలం | 2,240 | 24,976 | 43,057 | 69,263 |

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యువత ఓట్లే కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించేలా వారి ఓట్లు ఉన్నాయి. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా మంది 9,45,094 ఓటర్లు ఉండగా అందులో 18 నుంచి 39 ఏళ్ల మధ్య వారు అత్యధికంగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 4,75,746 మంది యువ ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో వెల్లడించింది.

**అందరి చూపూ వారివైపే..**

ఎన్నికల సమయం దగ్గరకు రావడంతో అభ్యర్థుల చూపంతా అధికంగా ఉన్న మధ్య వయస్కుల వారి ఓట్లపైనే పడింది. జిల్లాలో యువత ఓట్లే అత్యధికంగా ఉండడంతో వారిని ఆకర్షించడానికి ఆయా పార్టీల అభ్యర్థులు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. అయితే యువత మాత్రం అభివృద్ధి చేసిన పార్టీల వైపే మొగ్గు చూపుతోంది. తెలంగాణ వచ్చాక జరిగిన అభివృద్ధిని, అంతకు ముందు ఉన్న దుర్భర స్థితిని యువ ఓటర్లు గమనిస్తు న్నారు.

**కొత్తగూ డెంలో అత్యధికంగా 1,17, 058 మంది..**

జనరల్ స్థానమైన కొత్తగూడెం నియోజకవర్గంలో యువత ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,36,903 మంది కాగా, అందులో యువ ఓటర్లే 1,17,058 మంది ఉన్నారు. అంటే మొత్తం నియోజకవర్గ ఓటర్లలో సగభాగం యువతీ యువకులు, మధ్య వయస్కులే. ఉద్యోగ, ఉపాధి అవకాశాల వంటివి వీరిని ప్రభావితం చేయనున్నాయి.

### అభివృద్ధి చేసే అభ్యర్థే కీలకం..



ఒక ప్రాంతం అభివృద్ధి జరిగిందంటే అక్కడ గెలిచిన ఎమ్మెల్యేనే కారణం. అందుకే యువతీ యువకులు ఓట్లు వేయాలంటే ముందు చూసేది అతడు అభివృద్ధి చేయగలడా ? లేదా ? అని. అంతకుముందు ఎమ్మెల్యేలుగా ఉన్న వారు కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేసి ఉంటే యువతీ యువకులు కూడా మళ్లీ వారినే ఎన్నుకుంటారు.

–పెరుగు గోపి, కోయగూడెం, టేకులపల్లి మండలం

### తెలంగాణ వచ్చాక అభివృద్ధి జరిగింది..



తెలంగాణ వచ్చాకే అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరిగింది. అంతకుముందు ఈ ప్రాంతంలో అభివృద్ధి అనే మాటే లేదు. యువత కూడా తమ ప్రాంత అభివృద్ధిని, వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూస్తుంది. వీటిని ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వాలను, తమ అభివృద్ధికి బాటలు వేసే అభ్యర్థులను మాత్రమే యువతీ యువకులు ఆదరిస్తారు.

–ఎస్‌కే ఆసీఫ్, తిప్పనపల్లి, చండ్రుగొండ మండలం

### యువత నిర్ణయమే కీలకమవుతుంది..



యువత, మధ్య వయస్కుల్లో అత్యధికులు చదువుకున్న వారే ఉన్నారు. ఓటు వేసేటప్పుడు వీరు తప్పకుండా అభివృద్ధి గురించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి ఆలోచిస్తారు. అభివృద్ధి చేసిన, ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వాల వెంటే ఉంటారు. స్వయం ఉపాధి కల్పించిన వారినే ఆదరిస్తారు. –కాపు కుమారి, లక్ష్మీదేవిపల్లి మండలం

### ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటాం..



ఓటు హక్కు చాలా విలువైనది. దానిని యువ ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఐదేళ్లపాటు మన ప్రాంతం అభివృద్ధి జరగాలంటే అందుకు తగిన అభ్యర్థినే ఎన్నుకోవాలి. చదువుకున్న వాళ్లెప్పుడూ మాయమాటలు నమ్మరు. చేసిన అభివృద్ధిని, చేయాల్సిన పనులను చూస్తారు. యువతీ యువకులు ఎప్పుడూ తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే ప్రభుత్వాలనే కోరుకుంటారు. –జీ.ఉషశ్రీ, కొత్తగూడెం

# సలాం.. పోలీస్

- నేడు పోలీస్ అమరుల సంస్మరణ దినం
- జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

మామిళ్లగూడెం, అక్టోబర్ 20 : ప్రజలు తమ తమ కుటుంబాలతో ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నారంటే దానికి కారణం పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించడమే. సంపన్నులు మొదలు కొని సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ తమ అవసరానికి సాయం కోరేది పోలీసులనే. సమాజంలో పోలీసులే లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దొంగతనాలను అరికట్టాలన్నా.. ట్రాఫిక్ నియంత్రణ చేయాలన్నా.. నేతల ప్రాణాలకు రక్షణ కావాలన్నా.. పోలీసుల సాయం తప్పనిసరి. అలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ పలు ఘటనల్లో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటారు. భారత్–చైనా సరిహద్దు ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తులో రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్య ఉన్న వేడి నీటిబుగ్గ(హాట్‌స్ప్రింగ్) అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మన మధ్య నిలిచి ఉంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం ఈ పవిత్ర స్థలం నుంచే ఆరంభమైంది. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దులోని భారత్ భూభాగాలు లడఖ్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతా దళం, ఇండో–టిబెటిన్ బోర్డర్ పోలీస్ వంటి ప్రత్యేక భద్రతా దళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే బాధ్యతను కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ బలగాలు నిర్వర్తించేవి. 1959, అక్టోబర్ 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దులో విధులు నిర్వహిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్‌పీఎఫ్ దళం హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. ఈ క్రమంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. కానీ.. భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్‌స్ప్రింగ్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్ర స్థలంగా రూపుదిద్దుకున్నది. ఏటా అన్ని రాష్ట్రాల పోలీసు బృందాలు ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులర్పించడం ఆనవాయితీ. నిత్యం పోలీసులు చేస్తున్న పోరాటాలు, వీరోచిత చర్యలను మనం కళ్లారా చూస్తున్నాం. వీరు తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి దేశంలోని కోట్లాది మంది ప్రజలకు రక్షణ కవచమయ్యారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికి సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సమాజ ఆస్తులను సంరక్షించేది పోలీసులు మాత్రమే. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు శనివారం జిల్లాలో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

- 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు తొలిసారి అవకాశం
- వారి కోసం 12డీ ఫారంల జారీ ప్రక్రియ
- జిల్లాలో 36,053 మంది సీనియర్ సిటిజన్‌లకు అర్హత
- ఇందులో 16,761 మంది వృద్ధులు, 19,292మంది దివ్యాంగులు
- సత్తుపల్లిలో అధికంగా 8,756 మందికి అవకాశం
- ఎన్నికల సంఘం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధులు


# ఓట్ ఫ్రం హోమ్



కూసుమంచి, అక్టోబర్ 20 : గతంలో జరిగిన ఏ ఎన్నికల్లోనైనా ఓటు హక్కు ఉన్న వృద్ధులు విధిగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే వారు పోలింగ్ కేంద్రాలకు రావడం ఒక ఎత్తయితే.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేయడం పెద్ద ప్రయాసగా మారడంతోపాటు వివిధ రకాల సమస్యలు తలెత్తేవి. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం నెలకొనడం.. ఓటర్లు అభ్యంతరం తెలిపిన సందర్భాలూ ఉన్నాయి. ఎలాగోలా ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు తిరిగి ఇంటికి వెళ్లాలంటే నానా యాతన పడేవారు. ఇలాంటి ఇబ్బందులన్నీ గమనించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా పరిష్కార మార్గం చూపింది. 80 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం దరఖాస్తు ఎలా చేయాలి.. సంబంధిత ఫాం ఎలా నింపాలి అనే దానిపై ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**నియోజకవర్గాలవారీగా 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల వివరాలు..**

| నియోజకవర్గ | వృద్ధులు | దివ్యాంగులు | మొత్తం |
|---|---|---|---|
| పాలేరు | 2,702 | 2,291 | 4,993 |
| మధిర | 3,416 | 3,456 | 6,872 |
| ఖమ్మం | 3,937 | 3,600 | 7,537 |
| వైరా | 3,180 | 4,71 | 7,895 |
| సత్తుపల్లి | 3,526 | 5,230 | 8,756 |
| మొత్తం | 16,761 | 19,292 | 36,053 |



**జిల్లాలో అర్హులు 36,053 మంది**

జిల్లావ్యాప్తంగా 80 ఏళ్లు దాటిన వృద్ధులు 36,053 మంది ఉండగా.. వీరు ఇంటి నుంచి ఓటు వేసుకునేందుకు అర్హత కలిగి ఉన్నారు. వారిలో 19,292 మంది వృద్ధులు, 16,761 మంది దివ్యాంగులు ఉన్నారు. సత్తుపల్లిలో అధికంగా 8,756 మందికి అవకాశం లభించనున్నది. ప్రతి ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు వారి సహాయకులు, కుటుంబ సభ్యులను తీసుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే ఈసారి ఎన్నికల సంఘం కల్పించిన అవకాశంతో వృద్ధులకు ఇబ్బంది తీరినట్లైంది.

**నామినేషన్ ప్రక్రియ తర్వాత దరఖాస్తులకు అవకాశం**

శాసనసభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటుంది. ఆ తర్వాత వెంటనే 80 ఏళ్లు పైడిన వారి కోసం 12 డీ ఫాంల జారీ ప్రక్రియను ప్రారంభిస్తారు. వయసు తదితర కారణాల రీత్యా ఇంటి నుంచే ఓటు వేసుకునే అవకాశం కల్పించాలంటే తప్పనిసరిగా 12 డీ ఫారం పూర్తి చేయాలి. సంబంధిత దరఖాస్తును పోలింగ్ తేదీకి ఐదు రోజుల ముందు బీఎల్‌వోకు అందజేయాలి. దీనిని ఎన్నికల మొబైల్ టీం పరిశీలించిన తర్వాత దరఖాస్తుదారుడి అభ్యర్థన, అతడి ఆరోగ్య పరిస్థితులనుబట్టి ఓటు హక్కుకు అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం ఒక నోడల్ అధికారిని నియమిస్తారు. వారికి బ్యాలెట్ ఓటు విధానంపై శిక్షణ కూడా ఇస్తారు.

### తిప్పలు తప్పుతాయి



నాకు 86 ఏళ్లు. కాళ్ల వాపులతో నడవలేను. ఓటు వేయడానికి వెళ్లాలంటే ప్రతి ఎన్నికల్లో ఇబ్బందులు పడుతున్నా. అక్కడ క్యూలో నిలబడడం.. ఒకరి సహాయం ఉంటేనే ఓటు వేసే పరిస్థితి. మా లాంటి పెద్ద వయస్సు వారికి, ఆరోగ్యం సక్రమంగా లేని వారికి, దివ్యాంగులకు, 80 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్ద ఉండి ఓటు వేసుకోవచ్చని తెలిసింది. ఇంటికాడి నుంచే ఓటు వేసుకునే అవకాశం కల్పించిన ఎన్నికల సంఘానికి నా నమస్కారం.

– బోనగిరి ఆంజనేయులు, కూసుమంచి

### ఇంటి కాడి నుంచే ఓటేస్తా



నేను నడవలేను. ఇంటి కాడికి ఓటు వస్తది అంటే ఓటు వేస్తా. పోయిన సారి కూడా ఓటు వేయలేదు. పోయేటప్పుడు తీసుకపోతాండ్రు కానీ మళ్లీ తీసుకరావడం లేదు. ఇంటి దగ్గర ఓటు అంటే ఎట్లా వేయాలో తెల్వదు. నా వయస్సు 96 సంవత్సరాలు. రజాకార్ల హడావుడి అప్పటి సంది నాకు ఓట్లు తెలుసు. చాలాసార్లు ఓట్లు వేసిన కానీ ఇప్పుడు పానం బాగలేదు. ఈసారి పోలేను కానీ ఇంటికాడి నుంచే ఓటు వేయొచ్చంటే వేస్తా.

– మంది భద్రమ్మ, కూసుమంచి